వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 169
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఏప్రిల్ 02, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## బీసీ హక్కుల సాధనకే న్యూఢిల్లీ ధర్నా

- ప్రభుత్వ వైఖరి తనకు అనుకూలంగా మార్చుకునే వైనం
- డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు



6లో..

## ఆధునిక టెక్నాలజీతో చెత్త సేకరణ

- జవహర్ నగర్ డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్
- జీడబ్ల్యూఎంసీలోనూ ఇదే తరహా విధానం అమలుకు యోచన



8లో..

## అంబేద్కర్ ను అవమానించిన బీజేపీ

- భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ అండ
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



2లో..

## సన్న బియ్యం.. చారిత్రాత్మక నిర్ణయం

- మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



# జంతర్ మంతర్ లో.. ధూం..ధాం



వివరాలు 2లో..


- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా
- దేశవ్యాప్తంగా తరలివచ్చిన బీసీలు
- ప్రాంతీయ పార్టీల సంఘీభావం
- పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పార్లమెంట్ లో ఆమోదించాలంటూ డిమాండ్

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు కదంతొక్కారు. రోడ్డెక్కి పోరు బాట పట్టారు. బీసీ పోరు గర్జన పేరుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా జాతీయ స్థాయి ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ధూం.. ధాంగా నిరసన ప్రదర్శనను నిర్వహించారు. మహా ధర్నాను చేపట్టారు. రోడ్డుపైనే బైఠాయించి నినదించారు. ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ఈ మహా ధర్నాకు ప్రాంతీయ పార్టీలు సంఘీభావం ప్రకటించగా దేశ వ్యాప్తంగా ఉన్న బీసీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ సత్తా చాటారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల సహకారంతో న్యూఢిల్లీలో నిర్వహించిన మహాధర్నాకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ శాసనసభ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో కూడా ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీకి పుట్టగతులుండవంటూ హెచ్చరించారు.

-వరంగల్ వాయిస్ ప్రతినిధి

# జంతర్ మంతర్ లో.. ధూం..ధాం

- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా
- దేశవ్యాప్తంగా తరలివచ్చిన బీసీలు
- ప్రాంతీయ పార్టీల సంఘీభావం
- పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పార్లమెంట్ లో ఆమోదించాలంటూ డిమాండ్




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు కదంతొక్కుతున్నారు. రాష్ట్రంలో జరిగిన అనేక బీసీ ఉద్యమాల్లో సంఘటితంగా ఉద్యమించిన బీసీలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వేధికగా మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును ఢిల్లీలోని పార్లమెంట్‌లో కూడా ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనేది తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన డిమాండ్. దీనిపై ఇదివరకే రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది కూడా. దీన్ని కేంద్రానికి పంపించింది. ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలంటూ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలంటూ తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు కొంతకాలంగా పట్టుబడుతున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పోరు గర్జన బాట పట్టారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ బీసీ మహా ధర్నాలో సుమారు రెండు వేలకు పైగా బీసీలు ప్రతినిధులు పాల్గొన్నారు.

### రాహుల్ మాట ప్రకారం..

బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. అందులో మీకొచ్చిన కష్టమేంటీ అంటూ రేవంత్ ప్రధానికి నిలదీశారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీసీల కోసం చేయగలిగినంత చేస్తున్నామని, అవసరమైతే లక్షల మందితో ధర్నాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని సీఎం పిలుపునిచ్చారు.

### దేశ వ్యాప్తంగా మద్దతు..

దేశవ్యాప్తంగా వెంటనే కులగణన చేపట్టాలంటూ బీసీ నాయకులు చేస్తున్న ఉద్యమానికి సర్వత్రా మద్దతు లభిస్తోంది. చట్టసభల్లో బీసీ మహిళలకు 33 శాతం సబ్ కోటా ఇవ్వాలంటూ నినదించారు. దీనికి సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు. దీనికి–ప్రతిపక్షాల ఉమ్మడి సంకీర్ణ కూటమి ఇండియా బ్లాక్ నుంచి మద్దతు లభిస్తోంది. అదే విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా ధర్నాకు హాజరై తన సంఘీభావం ప్రకటించారు. ఆయనతో పాటు తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ కోదండరాం, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అదే విధంగా అఖిల భారత మజ్లిస్–ఇత్తెహాదుల్–ముస్లిమీన్ అధ్యక్షుడు, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ మనోజ్ ఝా, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే, డీఎంకే ఎంపీ కనిమొళి బీసీ గర్జనకు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల బీసీ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, తెలంగాణ ఎంపీలు, శాసనసభ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులతోపాటు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ పాల్గొన్నారు.



# సన్న బియ్యం చారిత్రాత్మక నిర్ణయం

- మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకంగా చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాల ఘనపూర్ మండలం నాగారం, నెల్లుట్ల, లింగాల ఘనపూర్ గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగ ప్రవేశ పెట్టిన రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల ఆకలి తీర్చేందుకు దేశంలోనే మొట్ట మొదటిసారిగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందని తెలిపారు. రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని అలాగే పేద ప్రజల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో పేద ప్రజలకు రేషన్ షాప్ ల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చరిత్రతాత్మకమని కొనియాడారు. ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### సర్వాయి పాపన్న స్ఫూర్తి దాయకం..

సర్దార్ సర్వాయి పాపన్న జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని పురస్కరించుకొని లింగాల ఘనపూర్ మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళులర్పించారు. అనంతరం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, గౌడ సంఘం నాయకులు, బీసీ సంఘాల నాయకులు, మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ రాద్ధాంతం అర్థరహితం

- గచ్చిబౌలి భూములపై కోర్టుల్లో కొట్లాడింది రేవంత్ సర్కార్
- ప్రెస్ మీట్ లో టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుల్లో కొట్లాడి సాధించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు అవి హెచ్ సీయూ భూములు అంటూ రాద్ధాంతం చేయడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవానికి ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 2003లో ఐఎంజీ అకాడమీస్ సంస్థకు కేటాయించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వాటిని రద్దు చేసి, 2006 నవంబరులో ఏపీ యూత్ అడ్వాన్స్ మెంట్ టూరిజం, కల్చరల్ డిపార్టుమెంటుకు కేటాయించారన్నారు. అయితే, తమకు కేటాయించిన భూమి బదలాయింపు రద్దుపై ఐఎంజీ అకాడమీస్ సంస్థ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఐఎంజీ అకాడమీస్ సంస్థకు వ్యతిరేకంగా 2004లో హైకోర్టులో తీర్పు రావడంతో, ఆ సంస్థ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ 9265/ 2024 ద్వారా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు కూడా ఈ భూములు ప్రభుత్వానివేనని తీర్పునివ్వడంతో సుదీర్ఘ పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వ వాదనను బలంగా వినిపించి అన్యాయం కానున్న భూములను రేవంత్ సర్కారు కాపాడిందన్నారు. ఇది చూసి ఓర్వలేని కుహనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలతో అమాయక విద్యార్థులను రెచ్చగొడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఎవరు అవునన్నా, కాదన్నా.. కంచ గచ్చిబౌలి ప్రభుత్వ భూముల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐటీ అభివృద్ధి చేసి తీరుతుందన్నారు. వాస్తవాలను వక్రీకరించి, తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను రెచ్చగొట్టే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- 8న ప్రజా ధర్నాను జయప్రదం చేయండి
- పోస్టర్ ఆవిష్కరించిన న్యూ డెమోక్రసీ నాయకులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ , రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ సెంటర్ లో ఉదయం 11 గంటలకు జరుగు ప్రజా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ఆ పార్టీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట మధ్యభారతంలో ఆదివాసి జాతి ప్రజలపై కేంద్ర రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలు జల్ జంగిల్ జమీన్ ఇజ్జత్ అమరా హై అంటూ అడవిని అడవిలోని సహజ సంపద, ఖనిజ సంపద వనరులను కాపాడుకునేందుకు పోరాడుతున్నారని వారిపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రూర మారణ కాండను అమలు చేస్తున్నాయని ఆయన అన్నారు. ఆదివాసి గిరిజన ప్రజల హక్కుల రక్షణ కోసం రాజ్యాంగంలోని ఐదు ఆరు షెడ్యూల్లో చేసిన చట్టాలను మోడీ అమిత్ షా ప్రభుత్వం కాలరాస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రత్యేకించి చత్తీస్ గఢ్ రాష్ట్రంలో ఆదివాసుల మీద పెద్ద ఎత్తున అణచివేత, నిర్బంధం, జాతిహననాన్ని కొనసాగిస్తున్నదని అంటూ ఈ హత్యాకాండ బహుళ జాతి సంస్థలకు, దళారీ నిరంకుశ కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెట్టెందుకైనని ఇది ఆదివాసి జాతి మనుగడకి ప్రమాదమన్నారు. 2024 జనవరి నెల ప్రారంభం నుంచి మొదలుపెట్టిన ఆపరేషన్ కగార్ నేటి వరకు వందలాది మంది ఆదివాసీలను అలాగే మావోయిస్టు పార్టీ నాయకులను కార్యకర్తలను ఎన్ కౌంటర్ల పేరుతో చంపేస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ కూటమి నేతృత్వంలో జరుగుతున్న ఈ మరణకాండపై అన్ని జాతీయ ప్రాంతీయ పార్టీలు గొంతు ఎత్తాలనే భావన నుంచే ఆపరేషన్ కగార్ నిలుపుదల కోసం ఐక్య కార్యాచరణ ఏర్పాటుకు ముందుగా ఈ , కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ధర్నాను జయప్రదం చేయుటకు వివిధ వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు, బన్న నరసింగం, మన్నే కరుణాకర్, ఎండీ అక్బర్, బండి చంద్రమౌళి పాల్గొన్నారు.

# సన్న బియ్యం ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హుజురాబాద్ నియోజకవర్గం, కమలాపూర్ మండలం, మర్రిపల్లిగూడెం గ్రామంలోని మూడు రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, డైరెక్టర్ గట్టు శ్రీధర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలకు సన్నబియ్యం ఇచ్చిన రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు మొగిలయ్య, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ ఓలాద్రి, కంకటి కృష్ణా, నాగరాజు, రమేష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సొసైటీ ఆవరణలో మాదాసు రవి గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కేజీకేఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్, మాజీ సర్పంచులు నారగాని దేవేందర్ గౌడ్, మోటపోతుల శివశంకర్ గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు ల్యాదళ్ల సమ్మయ్య గౌడ్, గుర్రం తిరుపతి గౌడ్, పాలకవర్గ ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, మాజీ సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఘనంగా బొమ్మల కట్టయ్య జయంతి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** ప్రజారత్న, భీమ్ రత్న, దళిత రత్న, తెలంగాణ మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు బొమ్మల కట్టయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కరీమాబాద్ అంబేద్కర్ భవన్ వద్ద అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, 41వ డివిజన్ కార్పొరేటర్ మరుపిల్ల రవి హాజరై, మహనీయుల విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు తరాల రాజమణి, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు రౌతు రమేష్, కాంగ్రెస్ నాయకులు నాగపురి సంజయ్ బాబు, మేడిది మధుసూదన్, ఎస్సీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ డాక్టర్. కొంగర జగన్, బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి వాసు, భవంతంకి అధ్యక్షులు నీలం మల్లేష్, వార్డు పెద్దమనిషి కడారి కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జక్కుల రాజు, తరాల రవితేజ, బొమ్మల రాంప్రసాద్, మగ్గిడి సుధాకర్, ఒంటెల సురేష్, ఒగ్గుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టయ్య గారి సేవలను కొనియాడుతూ, ఆయన గ్రామ గ్రామాన అంబేద్కర్ ఆలోచన విధానాన్ని విస్తరించి, 847 యువజన సంఘాలను స్థాపించి, జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా అనేక సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర వహించారని ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల కోసం ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన జయంతిని జరుపుకోవడం గౌరవంగా భావిస్తున్నామని పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# పద్మశాలి ముద్దుబిడ్డ కొలిపాక రాజ్యలక్ష్మికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్:** కొత్తవాడ శతరంజి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కొలిపాక మధనయ్య సతీమణి కీర్తిశేషులు రాజ్యలక్ష్మి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ, రాజ్యలక్ష్మి జీవితం పవిత్రమైన చేనేత వృత్తికి అంకితమై ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని చేనేత వృత్తి పరిరక్షణకు, కార్మికుల సంక్షేమానికి కృషి చేయడం నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్ణానంద శతరంజి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, పద్మజ్యోతి పరపతి సంఘం అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు, కాకతీయ చేనేత సహకార సంఘం అధ్యక్షులు మాచబత్తుల కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు యెలుగం చిన్న భద్రయ్య, దామెర సర్వేశం, రాజ్యలక్ష్మి కుమారులు వెంకటేశ్వర్లు, శ్రీహరి, బంధుమిత్రులు, చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండల పరిధిలోని రోళ్లకల్ ప్రాథమికోన్నత పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ (కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ) ఆధ్వర్యంలో మంచినీటి జలశుద్ధి కేంద్రాన్ని (వాటర్ ప్లాంట్) మండల విద్యాధికారి జి.లింగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలు నానాటికీ తగ్గిపోతూ కలుషితమవుతున్నాయని, దీనివల్ల ఫ్లోరైడ్ ప్రభావం ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించడం అత్యవసరమని చెప్పారు. ఈ సమస్యను గుర్తించిన కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్, పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ఇది పిల్లల్లో సామాజిక స్పృహను పెంపొందించడంతో పాటు ఆరోగ్యవంతమైన విద్యార్థులను తయారుచేయడంలో సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మండలంలోని మరికొన్ని పాఠశాలల్లో కూడా ఈ అవకాశాన్ని అందించాలని కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్‌ను కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెట్లోజు సురేష్ బాబు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సీహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ యం. సుశీల, ఉపాధ్యాయులు ఎల్. విష్ణువర్ధన్, వి. సంపత్, బి. జలేందర్, వి. అరవింద్ కుమార్, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సొమ్మొకడిది.. సోకొకడిది..

- రేషన్ డీలర్ల వద్ద ప్రధాని ఫొటో ఉండాలి
- తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం సబ్సిడీ అందిస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాము ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ర్యాంకమ శ్రీనివాస్ ఆరోపించారు. సన్న బియ్యం పంపిణీ రేషన్ డీలర్ల వద్ద ఫ్లెక్సీలో ప్రధానమంత్రి మోడీ ఫొటో లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రధాని ఫొటోలు వెంటనే ఫ్లెక్సీలో ముద్రించాలని కోరుతూ కమలాపూర్ మండల బీజేపీ శ్రేణులు కమలాపూర్ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని మభ్యపెడుతూ సన్న బియ్యం పేరిట గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కట్కూరి అశోక్ రెడ్డి, తుమ్మ శోభన్ బాబు, తోట సురేష్, ఇనుగాల రత్నాకర్, భూపతి ప్రవీణ్, చేలిక శ్రీనివాస్, బండారి సుధాకర్, పుల్ల అద్భుతరావు, నాసని రాజు, రాజేందర్, చెరపల్లి రతన్, పాక కుమార్ స్వామి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు తరలిరావాలి

➲ సభను విజయవంతం చేయాలి
➲ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, అభిమానులకు, ప్రజలకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పరకాల మున్సిపాలిటీ, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం మండలాలతో పాటు జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 15, 16, 17 డివిజన్ల సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, "మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలను మోసం చేసింది. అధికారంలోకి వచ్చాక హామీలను మరిచి, గ్రామాల్లో తిరగలేని పరిస్థితిని తెచ్చుకుంది. 15 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడటంతో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనడానికి వెనుకడుగు వేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఓర్పుతో, సమన్వయంతో పనిచేయాలి. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు తెలియజేయాలి. పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుంది. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం, వారికి అండగా ఉంటాం," అని పేర్కొన్నారు. ఇక రజతోత్సవ సభకు సన్నాహకంగా, నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లాలని సూచించారు. రేపటి నుండి మండలాల సమన్వయ కమిటీ సభ్యులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, సభకు హాజరయ్యే పార్టీ శ్రేణుల సంఖ్య, అవసరమైన వాహనాల వివరాలతో జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరకాల మున్సిపాలిటీ, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం మండలాల సమన్వయ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1లో విలాయత్ అలీ ప్రతిభ




◆ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికకు అవకాశాలు

**వరంగల్ వాయిస్, ఐనవోలు:** మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన మోహమ్మద్ విలాయత్ అలీ, తన అంకితభావం, కఠినశ్రమతో తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 86వ ర్యాంక్ సాధించి గర్వించదగ్గ విజయాన్ని అందుకున్నారు. విలాయత్ అలీ, మోహమ్మద్ మహబూబ్ అలీల కుమారుడు, 2015-2018 బ్యాచ్‌లో వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అనంతరం శ్రీనిధి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బీటెక్ చదివారు. తన కెరీర్‌ను మల్టీనేషనల్ కంపెనీలో రెండేళ్లు కొనసాగించినప్పటికీ, ఉన్నత లక్ష్యాల సాధన కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూప్-1 పరీక్షలకు సమర్థంగా సిద్ధమయ్యారు.కృషి, పట్టుదలతో బీసీ-ఈ కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్, జోనల్ స్థాయిలో 1వ ర్యాంక్ సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ విజయంతో, మల్టీజోన్ ర్యాంక్ ఆధారంగా డిప్యూటీ కలెక్టర్ పదవి పొందే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.బైరి ప్రభాకర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎం.వెంకన్న, అధ్యాపక వర్గం విలాయత్ అలీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్ మాట్లాడుతూ "విలాయత్ అలీ సాధించిన ఈ ఘనత మా విద్యాసంస్థకు గర్వకారణమన్నారు. ఆయన యువతకు స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ." అని పేర్కొన్నారు. విలాయత్ అలీ తన కృషి, నిబద్ధతతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

# పట్టుపట్టి.. గ్రూప్-1 కొట్టి

◆ గాలి రాహుల్ కు ఎస్సీ కేటగిరీలో 23వ ర్యాంకు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఖిలా వరంగల్ మండలం మామునూరు గ్రామానికి చెందిన గాలి రాహుల్ ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లో 555వ ర్యాంక్ సాధించి, మల్టీ జోన్-1 ఎస్సీ కేటగిరిలో 23వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. గాలి రాహుల్, 2023-2024లో టీజీపీఎస్సీ నిర్వహించిన ఏఓ, జేఏఓ, సీనియర్ అకౌంటెంట్ (అర్బన్ లోక్ బాడీస్) పరీక్షలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏం)గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన కొత్తగూడెం మున్సిపల్ ఆఫీసులో జేఏఓగా విధులు నిర్వహిస్తున్నారు. రాహుల్, గాలి జయ-రవి కుమార్ దంపతుల చిన్న కుమారుడు. మామునూరు గ్రామంలో హరికృష్ణ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదివి, వరంగల్‌లోని సివి రామన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ బీ (లా) అభ్యసించారు. తండ్రి గాలి రవి కుమార్ తనను కష్టపడి చదివించాడని, పెట్రోలు పంపులో పని చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో వాచ్ మెన్‌గా, నిజాం కళాశాలలో అటెండర్‌గా పని చేసి కుటుంబాన్ని పోషించాడని రాహుల్ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి వాచ్ మెన్‌గా పనిచేసిన అదే ఉస్మానియా యూనివర్సిటీలో తాను లా చదివి, ఇప్పుడు గ్రూప్-1 ఉద్యోగం సాధించడం ఎంతో ఆనందకరంగా ఉందని తెలిపారు. రాహుల్ తన ప్రిపరేషన్‌లో అన్నయ్య గాలి ఉదయ్ కిరణ్ ఎంతో సహాయసహకారాలు అందించారని పేర్కొన్నారు. ఆర్థికంగా, మానసికంగా, భావోద్వేగంగా అన్నయ్య ఎప్పుడూ తనకు మద్దతుగా నిలిచాడని చెప్పారు. తల్లి గాలి జయ ఎప్పుడూ వెన్నంటే ఉండి ప్రోత్సహించిందని, ప్రిపరేషన్‌లో కూడా సహాయపడిందని తెలిపారు. తన పెద్దనాన్న గాలి వినోద్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ లా ఫ్యాకల్టీ మాజీ డీన్‌గా పనిచేశారని, సివిల్స్ కోసం ప్రిపేర్ కావాలని ముందుగా ఆయనే సూచించారని రాహుల్ చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారాహిల్స్‌లో సివిల్స్‌కు సిద్ధమయ్యారని, తన విజయం వెనుక ఆ సంస్థ కీలక పాత్ర వహించిందన్నారు. తమ గ్రామం నుంచి రాహుల్ మొట్టమొదటి గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపిక కావడం తమ కుటుంబానికి, గ్రామానికి ఎంతో గర్వకారణమని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



## పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



**వరంగల్ వాయిస్, సుబేదారి:** హనుమకొండలోని గోకుల్ నగర్ నివాసి సహేరా బేగం బుధవారం ఉదయం 7 గంటల సమయంలో నిత్యావసరాల కోసం కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తన మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసు జారిపోయింది. ఇంటికి చేరుకున్న ఆమె గొలుసు కనిపించకపోవడంతో వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదును ఎస్ఐ సుమన్ స్వీకరించగా, క్రైమ్ కానిస్టేబుల్ మారేపల్లి ప్రభాకర్ చాకచక్యంతో స్పందించి, కోల్పోయిన బంగారు గొలుసును గుర్తించి సహేరా బేగానికి అప్పగించారు. పోలీసులు అందించిన సహాయాన్ని ఆమె హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన క్రైమ్ కానిస్టేబుల్ మారేపల్లి ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి ప్రశంసించారు.

## సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం



**వరంగల్ వాయిస్, రేగొండ:** పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోలేపాక సాంబయ్య, బాలేరావు రామారావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేగొండ మండలం దమ్మన్నపేట్, రూపిరెడ్డిపల్లి గ్రామాల్లోని రేషన్ షాప్‌లలో ప్రజా పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మహత్తరమైన పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్నబియ్యం సరఫరా చేయడం చారిత్రక నిర్ణయమని, ఇది పేదల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను కూడా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఐల శ్రీధర్ గౌడ్, కర్ణాకర్, సుక్క జనార్ధన్, కొండమల్ల రాజా, ఐలయ్య, తోట రఘు, బండారి దేవేందర్, పంచగిరి రవి, నాగపురి శ్రీధర్, నాగపురి మొగిలి, నాగపురి శంకర్, ముడతనపల్లి శంకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై కాలేజీ విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మానవ అక్రమ రవాణాపై యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, పోలీస్ కళా బృందం, సుబేదారి పోలీసుల ఆధ్వర్యంలో న్యూసైన్స్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులతో ఎలాంటి పనులు చేయించుకోవద్దన్నారు. నవజాత శిశువులను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్ న్కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సుబేదారి ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఏహెచ్ టీయూ ఇన్ స్పెక్టర్ వెంకన్నతో పాటు ఎస్ఐలు, జాగృతి కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

# విజయవంతంగా రక్తదాన శిబిరం నిర్వహణ

**వరంగల్ వాయిస్, వరంగల్:** వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్, ఎంజీఎం హాస్పిటల్‌లో 1615వ 'వరల్డ్‌వైడ్ బ్లడ్ డ్రైవ్ టు గివ్ లైఫ్ త్రూ ది లవ్ ఆఫ్ ది పాస్‌ఓవర్'ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, స్థానికులతో పాటు దాదాపు 150 మంది పాల్గొని రక్తదానం చేశారు. నిత్యజీవానికి ప్రతీక అయిన బైబిలియన్ పండుగ పస్కా జ్ఞాపకార్థంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య అత్యవసర పరిస్థితుల్లో స్థిరమైన రక్త సరఫరా అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. చర్చ్ ఆఫ్ గాడ్ ప్రతినిధి జనరల్ పాస్టర్ కిమ్ జ్యో చ్యోల్, సమాజ శ్రేయస్సు కోసం క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ఎంత ముఖ్యమో వివరిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్, వరంగల్ అర్బన్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాంబ శివరావు హాజరై, ఎండాకాలంలో ప్రాణాలను రక్షించడంలో స్వచ్ఛంద రక్తదానానికి






ఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే, చర్చ్ ఆఫ్ గాడ్ చేస్తున్న మానవతా సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తదానం చేసిన వారికి రిఫ్రెష్‌మెంట్ అందించబడింది. 2005లో ప్రారంభమైనప్పటి నుంచి, చర్చ్ ఆఫ్ గాడ్ ప్రపంచవ్యాప్తంగా 1,500కి పైగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో 1,22,100 మందికి పైగా దాతలు పాల్గొని ప్రాణాలను కాపాడే సేవలను అందించారు. రక్తదానానికి మించి, ఈ చర్చి పర్యావరణ శుభ్రపరచడం, చెట్ల పెంపకం, దుర్బల వర్గాలకు మద్దతు వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటుంది. 175 దేశాల్లో 3.92 మిలియన్లకు పైగా విశ్వాసులతో, చర్చ్ ఆఫ్ గాడ్ ప్రేమ, సేవను ప్రోత్సహిస్తూ, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రభుత్వాలు, సంస్థల నుండి అవార్డులను అందుకుంటూ గుర్తింపును పొందుతోంది.

## పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** పేదలకు పౌష్టిక ఆహారం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇది ప్రజల మేలు కోరే ప్రభుత్వని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం క్రమంలో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ పరిధిలోని న్యూ శాయంపేటలో బియ్యం పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది కానుకగా ఈ పథకాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, వారి ఆకలి తీర్చేందుకు ఈ పథకం అమలు చేయడం గర్వ కారణమని కార్పొరేటర్ అన్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మోహన్ రావు, మాడిశెట్టి శివశంకర్, డివిజన్ అధ్యక్షుడు సురేందర్, సీనియర్ నాయకులు కనుకుంట్ల కృష్ణ, సత్తు రమేష్, రేషన్ బియ్యం పంపిణీదారులు వెనుకంటి విజయపాల్, రాసమల్ల రాజు, రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం క్రెడిట్ కేంద్ర ప్రభుత్వానిదే

### మాజీ కౌన్సిలర్ పూర్ణా చారి



**వరంగల్ వాయిస్, పరకాల:** పేద ప్రజలకు పోషకాహారాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 కిలోల సన్నబియ్యం పథకం కింద, ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం, 1 కిలో బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో, ప్రజలకు నిజాలను తెలియజేయాలని సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరోనా మహమ్మారి కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 1 కిలో ఇస్తూ మొత్తం తమదేనని ప్రచారం చేసుకుంటోంది. లబ్ధిదారులకు వాస్తవ పరిస్థితిని తెలియజేయడానికి, రేషన్ షాప్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచారు. అలాగే, ప్రతి రేషన్ షాప్ డీలర్ తన దుకాణం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు, 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, పట్టణ నాయకులు సంగా పురుషోత్తం, వేముల అశోక్, రేషన్ బియ్యం లబ్ధిదారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# తోట సోనిని అభినందించిన మున్నూరు కాపు సంఘం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ టైలర్స్ స్ట్రీట్‌కు చెందిన తోట దామోదర్-జ్యోతి దంపతుల కుమార్తె తోట సోని గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన గ్రూప్-1 జనరల్ ర్యాంకుల జాబితాలో ఆమె రాష్ట్ర స్థాయిలో 203వ ర్యాంకు, మల్టీ జోన్ స్థాయిలో 93వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్ యూ), ఢిల్లీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో పీజీ పూర్తి చేసిన ఆమె, అప్పటినుంచి సివిల్స్ ప్రిపరేషన్‌లో నిమగ్నమై, తెలంగాణ రాష్ట్ర టీజీపీఎస్సీ గ్రూప్స్‌కు కూడా సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గ్రూప్-4లో ఉద్యోగం సాధించి, ప్రస్తుతం శాయంపేట ఎంజేపీ లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాక, ఇటీవల ప్రకటించిన గ్రూప్-2లో జోనల్ స్థాయిలో 3వ ర్యాంకు, గ్రూప్-3లో ఉద్యోగ అర్హతను కూడా పొందారు. నడికూడ మండలం చౌటుపర్తి గ్రామంలోని మున్నూరు కాపు కుటుంబానికి చెందిన ఆమె తండ్రి తోట దామోదర్ హనుమకొండ టైలర్స్ స్ట్రీట్‌లో చిన్న బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందినప్పటికీ, కష్టసాధనతో గ్రూప్-1లో ఉత్తమ ర్యాంకును సాధించి ప్రాముఖ్యతను



సంపాదించారు.ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుకారి శ్రీధర్, కోశాధికారి పూజారి సత్యనారాయణ, ఎనిమిదవ డివిజన్ అధ్యక్షుడు సిద్ద శెట్టి శ్రీనివాస్, నాలుగో డివిజన్ గౌరవ అధ్యక్షుడు వాసం సోమయ్య, డివిజన్ అధ్యక్షుడు మిరుపెల్లి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తోట రమేష్, 52వ డివిజన్ అధ్యక్షుడు పేరం గోపి, ఏడో డివిజన్ కార్యదర్శి కొండ్ర సతీష్ కుమార్, తుల చిన్న తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించారు.

# రేణుక ఎన్‌కౌంటర్‌ను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రముఖ మావోయిస్టు నేత, జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన చేనేత కుటుంబంలో జన్మించిన విద్యావంతురాలు రేణుక విద్యార్థి దశలోనే విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితురాలై మావోయిస్టు పార్టీలో చేరారు. కవిగా, రచయితగా, పోరాట యోధురాలుగా ఎదిగి ప్రజా ఉద్యమాలలో కీలక పాత్ర పోషించిన ఆమెను ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎన్‌కౌంటర్‌లో హతమార్చడం అత్యంత దారుణమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని ప్రకటించిన తర్వాత ఎన్‌కౌంటర్లు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఎన్‌కౌంటర్ల ద్వారా ప్రజా పోరాటాలు ఆగిపోతాయనుకోవడం భ్రమేనని పేర్కొన్నారు. శ్రమ దోపిడి, పీడనం, ఆర్థిక అసమానతలు కొనసాగినంతకాలం ప్రజా పోరాటాలు ఆగవన్నారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకొని మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీజేపీ పాలనలో పౌర హక్కులు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యవాదులంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావలసిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు.అంతేకాక, మావోయిస్టు పార్టీ తన విధానాలను సమీక్షించుకొని, జనజీవన స్రవంతిలో కలిసి ప్రజాస్వామ్య శక్తులతో ఐక్య ఉద్యమాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

## సీతారాముల కళ్యాణం కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సీతారాముల కళ్యాణానికి సంబంధించిన కరపత్రాలను దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, అడ్వకేట్ లెక్కల జలంధర్ రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాలు ఆదివారం ఉదయం 10:30 గంటలకు తలంబ్రాలను స్వామివారికి అర్పించనుండగా, 11 గంటలకు కంది శ్రీనివాస్ రెడ్డి ధార్మిక ఉపన్యాసం చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:05 గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. కళ్యాణానంతరం, లెక్కల లక్ష్మీ – జలంధర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో నీల సమ్మిరెడ్డి, నీల రంగారెడ్డి, గిద్దమారి సురేష్, కోమటి గణేష్, గొట్టిముక్కుల సుమన్, బత్తుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక పుటల్లో సన్న బియ్యం పంపిణీ

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పేద ప్రజల ఆహార భద్రతకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట టౌన్ ఎస్సీ కాలనీలోని పలు వార్డు లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ చారిత్రక పుటలలో నిలిచేది పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమమని, దీనిని మార్చే ధైర్యం రాబోయే ఏ ప్రభుత్వానికి లేదన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంబంధించి ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ ఇస్తున్నామని తెలిపారు .ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న సన్న బియ్యం పథకాన్ని ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక టెక్నాలజీతో చెత్త నిర్వహణ

**◆ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్**

**◆ జీడబ్ల్యూఎంసీ పరిధిలో అమలుకు యోచన**



వరంగల్ వాయిస్, హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. ఈ సందర్శనలో జీహెచ్ఎంసీలో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి, చెత్త ట్రాన్స్ఫర్ స్టేషన్ల పనితీరు వంటి అంశాలను వారు పరిశీలించారు. చెత్తను నగరంలోని వివిధ డివిజన్ల నుంచి ఎలా తరలిస్తున్నారు. డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులు అమలు చేస్తున్నారు. రీసైక్లింగ్ విధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై అధికారులు వారికి వివరించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు మాట్లాడుతూ, చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయడం గొప్ప విషయం అని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలించి ఆధునిక టెక్నాలజీ ద్వారా వినియోగించడం అభినందనీయమని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డులో చెత్త నుంచి కరెంట్, గ్యాస్ తయారీ విధానాన్ని అధ్యయనం చేశామని, ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్‌లోనూ అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్శనలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రాముఖ్యత, ఆధునిక పద్ధతుల ఉపయోగం, వ్యర్థ పదార్థాల ద్వారా ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఇదే క్రమంలో, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డును శుక్రవారం రాంకీ సంస్థ ప్రతినిధులు సందర్శించనున్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డులో అమలు చేస్తున్న విధానాలను రాంపూర్ డంపింగ్ యార్డులోనూ శాశ్వతంగా అనుసరించేందుకు వీలుందా అనే అంశాలను వారు పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజా రెడ్డి, సంబంధిత అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం అమలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జమ్మికుంట మండలం వావిలాల, మడిపల్లి గ్రామాలలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందంలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఒడితల ప్రణవ్ బాబు, పుల్లూరి స్వప్న సదానందంలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మడిపల్లి, అంకుషాపూర్ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ కమిటీ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఉప్పుల సాంబశివరెడ్డి, మిల్కూరి తిరుపతిరెడ్డిలకు నియామక పత్రాలను ఒడితల ప్రణవ్ బాబు, పుల్లూరి స్వప్న సదానందం అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరంనేని పరుశరాములు రావు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏగ్గేటి సదానందం, వావిలాల, మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వానరాశి జాన్, ఉప్పుల సాంబశివరెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు ఏగ్గేటి కుమార్ స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, మ్యాకమల్ల అశోక్, మాసాడి కిషన్ రావు, చెన్నవేన రమేష్, కస్తూరి రాములు, ఒగ్గు కుమారస్వామి, బండి కుమార్, మిల్కూరి తిరుపతిరెడ్డి, రామిడి సూర్యతేజారెడ్డి, మహమ్మద్ ఫయాజ్, పల్లకొండ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బహుజన వీరుడు, ఓరుగల్లు పోరుబిడ్డ, ఆత్మగౌరవ యుద్ధ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం, బాలసముద్రంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ దక్కన్ గడ్డపై బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు.సాధారణ కులంలో జన్మించి, ఆనాటి ఆధిపత్య కులాల అధికారాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించి, దళిత బహుజనులను రాజ్యాధికారానికి నడిపించిన తొలి బహుజన రాజు పాపన్న గౌడ్ అని ఆయన పేర్కొన్నారు. పాపన్న స్ఫూర్తిదాయక పోరాటం భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని, కులం, మతం, వర్గం, జాతి అనే విచ్చిన్నకర అంశాలను పక్కనపెట్టి బహుజన రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, సల్వాజీ రవీందర్ రావు, ఇమ్మడి లోహిత, రాజు, పున్నం చందర్, రఘు, ఖలీల్, శ్రీనివాస్, రాజు, జె.కే, వసంత్, దేవమ్మ, సంపత్, రామ్మూర్తి పాల్గొన్నారు.

# మానవత్వం చూపిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం వరంగల్‌కు తిరుగు ప్రయాణంలో ఉన్న ఎమ్మెల్యే కాన్వాయ్, మార్గమధ్యంలో జరిగిన ప్రమాదాన్ని గమనించింది. బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి ఉన్నాడు.దీన్ని చూసిన ఎమ్మెల్యే వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి, గాయపడిన వ్యక్తిని ధైర్యం చెప్పారు. ప్రథమ చికిత్స అందించి, స్వయంగా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం అతన్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ లో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

# కమ్యూనిస్టులే అసలైన దేశభక్తులు

**➲ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**




**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం వీరోచితంగా పోరాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన హనుమకొండ జిల్లా సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఈడి, సీబీఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని విమర్శించారు. మైనార్టీలు, దళితులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని□ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అలాగే, చత్తీస్‌గఢ్‌లో "ఆపరేషన్ కగార్" పేరిట నరమేధం కొనసాగుతున్నదని, బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మహిళలు, గిరిజనులు, అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, నకిర్తి ఓదెలు, సుదర్శన్, ఏదునూరి వెంకట్రాజం, షేక్ బాబు, రేణిగుంట్ల దుర్గాప్రసాద్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, రాజయ్య, నేదునూరి సాంబయ్య, రేణిగుంట్ల వంశీ, వడ్లూరి సుధాకర్, గిన్నారపు రాజు, పస్కుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు..

ఈ సందర్భంగా మే 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించారు. హనుమకొండ జిల్లా సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మోతే లింగారెడ్డి, అధ్యక్షుడిగా నేదునూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా నేదునూరి జ్యోతి, చీఫ్ పాట్రన్ లుగా ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మిని ఎన్నుకోవడం జరిగినది. అలాగే 15 మంది ఉపాధ్యక్షులు, 15 మంది కార్యదర్శులు, 25 మంది కమిటీ సభ్యులతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు.

# బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఏర్పాట్లు

## ఎల్కతుర్తిలో ఘనంగా నిర్వహణ



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ రజతోత్సవాన్ని ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కన్నుల పడువగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ప్రారంభ పనుల అంకురార్పణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఈ సభ దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో కూడా జరగని విధంగా అత్యంత భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, పార్టీ స్థాపన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యాలు, తెలంగాణ ఉద్యమ సమయంలో అమరులైన ఉద్యమకారుల త్యాగాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషిని తిరిగి ఒకసారి ప్రజలకు గుర్తుచేయనున్నట్లు చెప్పారు. అలాగే, కేసీఆర్ పాలనలో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా తెలంగాణ ప్రజలు సుఖంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు రాజకీయ పరిస్థితులను గమనిస్తూ, కేసీఆర్ నాయకత్వాన్ని కోల్పోయిన బాధలో ఉన్నారని, మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ రజతోత్సవ సభ ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించబడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రతి కార్యకర్త దీనిని విజయవంతం చేయాలని కోరారు. అంతేకాక, సభ జరుగుతున్న రోజున హనుమకొండ, ఎల్కతుర్తి ప్రజలు అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# దమ్ముంటే నా సినిమా బ్యాన్ చేయండి :

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని.. సినిమా బాగాలేకున్న మేకర్స్ ఫేక్ కలెక్షన్ల్ చూపిస్తున్నారని కామెంట్లు వస్తున్న విషయం తెలిసిందే. పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సినిమాకు తక్కువ కలెక్షన్లు వచ్చాయని అంటున్నారు. వారికి నేను సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ఎవరికి తక్కువ కలెక్షన్లు వచ్చాయి అనిపిస్తుందో నా దగ్గరికి రండి వారికి అసలు కలెక్షన్లు చూపిస్తాను. ఇదేమైన పెద్ద హీరో సినిమానా కలెక్షన్లు రాకున్న బయట హౌస్‌ఫుల్ బోర్డ్ పెట్టడానికి.. నాకు అలాంటి అవసరం కూడా లేదు. సినిమా ఆడుతున్నప్పుడు.. ఎందుకు సపోర్ట్ చేయడం లేదు. ఎందుకు నెగిటివ్ రివ్యూలు రాస్తున్నారు. నా మీద అంత పగ ఉంటే దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా దగ్గర యాడ్ తీసుకోకండి. అప్పుడు నేను కూడా చూపిస్తాను నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో అంటూ నాగవంశీ చెప్పుకోచ్చాడు.



# శోభితకు బంపరాఫర్

## తమిళ దర్శకుడి సినిమాలో అవకాశం

అక్కినేని కోడలు, నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో పా.రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు. అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.



# మళ్లీ డార్లింగ్ తోనే

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు డార్లింగ్. ఇదిలా ఉంటే.. డార్లింగ్ సరసన మరోసారి ఛాన్స్ కొట్టేసింది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ. ఇప్పటికే ప్రభాస్ తో కలిసి ఓ సినిమాలో నటించి మెప్పించింది దిశా పటానీ. కొన్నాళ్లుగా బాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈఅమ్మడుకు.. ఇప్పడు ప్రభాస్ సరసన వరుస ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా దిశా పేరు మారుమోగుతుంది. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన దిశా పటానీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని హైలెట్ అయ్యింది. ఆ తర్వాత వరుణ్ తేజ్ సరసన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఆమె బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటూ అక్కడే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. చాలా కాలం తర్వాత ఇటీవల నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి చిత్రంలో ప్రభాస్ జోడిగా కనిపించింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో మరోసారి పాపులర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరోసారి ప్రభాస్ సరసన కనిపించనుందట. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో డార్లింగ్ నటిస్తున్న సినిమాలో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మరో హీరోయిన్ దిశా పటానీ కనిపించనుందని అంటున్నారు.



# అందం, అభినయంతో అదరగొడుతున్న పాయల్

ఆర్ ఎక్స్ 100 సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలతో ఎప్పుడూ నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షార్ట్ డ్రెస్ లో తన గ్లామర్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. డెమిన్ క్లాత్ తో తయారు చేసిన ఈ డ్రెస్ లో ఋ అమ్మడు చాలా అందంగా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ పాయల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆర్ ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో పాయల్ తన గ్లామర్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. పాయల్ రాజ్ పుత్ మొదటి సినిమా మంచి గుర్తింపు తెచ్చినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత పాయల్ డిస్కో రాజా, వెంకీ మామా, అనగనగా ఓ అతిథి, పకపా. మాయాపేటిక,మంగళ వారం వంటి సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో మంగళవారం మూవీతో మరోసారి ఈ అమ్మడుకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో పాయల్ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ తన వరస ఫొటో షూట్ తో నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ నటి, డెమిన్ క్లాత్ తో తయారు చేసిన సింగిల్ పీస్ షాట్ ధరించి తన అందాలతో మత్తెక్కిస్తుంది. డిఫరెంట్ ఫోజులతో ఉన్న ఈ ఫొటోలు నెటిజన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి.







# ధనుష్ డైరెక్షన్ లో రామ్‌చరణ్..?

దక్షిణాది చిత్రపరిశ్రమలో స్టార్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ధనుష్. నటుడిగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నాడు. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తున్నాడు. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ హీరోకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అలాగే హిందీలోనూ పలు సినిమాలతో అలరించాడు ధనుష్. తుళ్లువతో ఇలామై సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసిన ధనుష్.. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాలతో అడియన్స్ ముందుకు వచ్చాడు. హీరోగానే కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన సినిమాలను ఎంచుకుంటూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇన్నాళ్లు తమిళంలో వరుస సినిమాల్లో నటించిన ధనుష్.. ఇటీవలే సార్ సినిమాతో నేరుగా టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇటీవలే జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాతో దర్శకుడిగా మరో సక్సెస్ అందుకున్నాడు. తాజాగా మరో సినిమాను రూపొందించేందుకు సిద్ధమైనట్లు టాక్ వినిపిస్తుంది. జాబిలమ్మా నీకు అంత కోపమా సినిమా తర్వాత ధనుష్, అజిత్ హీరోగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు వార్తలు వినిపించాయి. అయితే దీని గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా ధనుష్ కొత్త సినిమా గురించి మరో క్రేజీ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ధనుష్ తెరకెక్కించే కొత్త సినిమాలో హీరోగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నట్లు టాక్. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు రామ్ చరణ్. ఇటీవలే గేమ్ ఛేంజర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చిన చరణ్.. ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్నాడు. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ధనుష్ దర్శకత్వంలో చరణ్ నటించనున్న సినిమాపై క్యూరియాసిటి నెలకొంది. వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమా గురించి త్వరలోనే అప్డేట్స్ రానున్నాయట. ప్రస్తుతం ధనుష్ కుబేర, ఇడ్లీ కడై చిత్రాల్లో నటిస్తున్నాడు.



# అంబేద్కర్ ను అవమానించిన బీజేపీ

- భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ అండ
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యంగ పరిరక్షణలో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశంతోపాటు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలంటూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని 47, 62, 63 డివిజన్ లోని కాజిపేట చౌరస్తా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ వారసత్వం, విలువలను కాపాడటానికి, దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలను ఐక్యత, సామాజిక న్యాయం సందేశంతో అనుసంధానించడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను ఆయన రచించిన రాజ్యాంగాన్ని బీజేపీ అవమానించిందని ఆరోపించారు. ప్రపంచం మొత్తం ఆదర్శంగా భావించే మహాత్మా గాంధీ నామ రూపాలు లేకుండా చేస్తోందన్నారు. అందుకే కాంగ్రెస్ ముందునిలిచి బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ వారసత్వాన్ని కాపాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, మొహమ్మద్ అబూబాకర్, గుంటి కుమారస్వామి, వీరగంటి రవీందర్, జై భీం, జై బాపు, జై సంవిధాన్ ఇంచార్జి డాక్టర్ పులి అనిల్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుష్, డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్, పాలడుగుల ఆంజనేయులు, పోగుల సంతోష్, నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్ యాదవ్, తమ్మిడి మానస, నాగపురి లలిత, అరూరి సాంబయ్య, రంగు సుదీర్, గుంటి స్వప్న, పోగుల శ్రీనివాస్, సిరిల్ లారెన్స్, దొంగల కుమారస్వామి, చీకటి ఆనంద్, బుర్ర బాబు రావు, రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధనకే న్యూఢిల్లీ ధర్నా

- ప్రభుత్వ వైఖరి తనకు అనుకూలంగా మార్చుకునే వైనం
- డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సాధికారికంగా ముందడుగు వేయకుండానే, గవర్నర్‌తో బీసీ బిల్లులను ఆమోదింపజేసే ప్రయత్నాన్ని సీరియస్ చేయకుండా, రాజకీయ ప్రహసనంగా వ్యవహరించడాన్ని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు తప్పు పట్టారు. కేంద్ర ప్రభుత్వం బీసీల విషయమై గణనీయంగా చేసింది ఏమీ లేదు. బీసీలకు అనుకూలంగా వ్యవహరించలేదన్నారు. దేశం మొత్తం బీసీ కులగణనను డిమాండ్ చేస్తుంటే కూడా కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. అయినా, ఈ సమయంలో కేంద్రంపై విమర్శలు చేయడం సరైనది కాదన్నారు. బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చించేందుకు కేంద్రంతో సుహృద్భావంతో వ్యవహరించి, రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయాల్సిన అవసరం ఉందని వకుళాభరణం అభిప్రాయ పడ్డారు. ఢిల్లీలో బీసీ సంఘాలు నిర్వహించిన ధర్నా శాంతియుతంగా, నిబద్ధతతో సాగిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్లే ధర్మపోరాటంగా అభివర్ణించారు. తెలంగాణలో బీసీల జనాభా 56 శాతానికి పైగా ఉన్నా, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ 29 శాతానికి మించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రస్తుతం 21 శాతమే రిజర్వేషన్ ఉందన్నారు. ఈ అసమానతల నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులను శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించినట్టు గుర్తు చేశారు. కుల గణాంకాల ఆధారంగా తీసుకొచ్చిన ఈ బిల్లులు శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రామాణిక గణాంకాలు, న్యాయపరమైన నివేదికలు, విధివిధానాలు సిద్ధం చేయాలన్నారు. పార్లమెంట్ రెండు సభల్లో ఆమోదం పొందే ప్రక్రియను తేలికగా తీసుకోవడం అనవసరం అన్నారు. రాజకీయ ప్రచారాలతో కాదు, చట్టపరమైన ధోరణితో, కేంద్రంతో సుహృద్భావంతో ముందుకు సాగాలని సూచించారు. లేకపోతే బీసీలకు అన్యాయం జరగే ప్రమాదం లేకపోలేదని డాక్టర్ వకుళాభరణం హెచ్చరించారు.



# 'నడక'కు సంకెళ్లు

- జాతీయ నడక దినోత్సవం రోజున హెచ్చరికలు
- డబ్బులు చెల్లిస్తేనే అడుగు పెట్టాలంటూ ట్యాంక్ బండ్ యజమాన్యం హుకుం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నడక చక్కటి, సహజమైన వ్యాయామం..రోజు నడవండి ఆరోగ్యంగా జీవించండి అంటూ ప్రతి ఏడు ఏప్రిల్ 2న జాతీయ నడక దినోత్సవం నిర్వహిస్తుండగా భద్రకాళి ట్యాంక్ బండ్ యాజమాన్యం మాత్రం అందుకు విరుద్ధంగా 'నడక'కు సంకెళ్లు వేస్తున్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా ట్యాంక్ బండ్ నిర్మాణం జరిగినప్పటికీ దానిని లీజుకు తీసుకున్న యాజమాన్యం మాత్రం వాకర్ల విషయంలో కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. నెలకు రూ.400 చెల్లిస్తేనే ట్యాంక్ బండ్ పై అడుగు పెట్టనిస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తోంది. ఏప్రిల్ 10వ తేదీ వరకే చాన్స్.. అప్పటి వరకు మంత్లీ కార్డ్ తీసుకోవాలని, లేకుంటే బండ్ పైకి అనుమతించమంటూ హుకుం జారీ చేశారు. దీంతో నిత్యం ఆరోగ్య సంరక్షణ కోసం బండ్ పైకి వచ్చే వయసు మళ్లిన వారు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఉదయం వచ్చే వాకర్స్ కు ట్యాంక్ బండ్ పై ఉచిత ప్రవేశం కల్పించాలని కోరుతున్నారు.

# అన్నమో రామచంద్ర.. అనే కాలం పోయింది

- దేశంలోనే సన్నబియ్యం పథకం చారిత్రాత్మకం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క





**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రతి నిరుపేద కుటుంబానికి సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతామని ఆవె వెల్లడించారు. పేదలకు కడుపునిండా తిండి పెట్టాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బుధవారం మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట మండలాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ మహేందర్ జీలతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అన్నమో రామచంద్ర అనే కాలం పోయిందని, ధనవంతుడు ఎలాంటి అన్నం తింటున్నాడో పేదవాడు సైతం అదే అన్నం తినాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఆహార భద్రత చట్టం తెచ్చి ప్రతి ఒక్కరికి బియ్యం పంపిణీ చేయాలన్న తరహాలోనే ప్రతి వ్యక్తికి పని కల్పించాలనే ఉద్దేశంతో పని కోసం హక్కు చట్టం తెచ్చిందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లు పండించిన రైతులకు రూ.500 బోనస్ అందించడం జరిగిందని, జిల్లాలో ఒక్క రైతుకు కూడా బోనస్ డబ్బులు బాకీ లేమని ప్రకటించారు. గత పాలకులు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్నప్పటికీ ఒకవైపు అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళా గ్రూపులకు ఇచ్చిన హామీ మేరకు వడ్డీ రూపాయలను బ్యాంకులలో జమ చేశామని వివరించారు. ఉచిత సన్న బియ్యం పంపిణి కోసం ప్రభుత్వం కిలోకు రూ.40 వరకు ఖర్చు చేసిందన్నారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మక మని, ముఖ్యమంత్రి పేదల కోసం మహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా తినదగిన బియ్యం సరఫరా చేస్తామని, ఈ పథకం పేదల గుండెల్లో నిలిచే పథకమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డీసీఎస్ఓ షా ఫైజల్ హుస్సేని, డీసీఎస్ఓ డీఎం రాంపతి, తహసిల్దార్ల విజయ భాస్కర్, గిరిబాబు, సృజన కుమార్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com